## న్యూఇయర్ విషెస్ పేరిట మోసాలు

**సైబర్ క్రైమ్ ఎస్సై ప్రమోద్**



అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ ఎస్సై ప్రమోద్

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 29: నూతన సంవత్సర శుభాకాంక్షలు, డిస్కౌంట్ల పేరిట జరిగే ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఎస్సై ప్రమోద్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రాజీవ్ గృహకల్పలో జైభీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పనికెర కృష్ణ అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్ మాట్లాడుతూ.. న్యూఇయర్ వేడుకలను సైతం సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారన్నారు. ఆప్తులు, స్నేహితులకు పంపే శుభాకాంక్షలు, దుకాణాలు ప్రకటించే ఆఫర్లను మోసాలకు మారుపేర్లుగా మార్చుకుంటున్నారని చెప్పారు. బోగస్ లింకులను తెరిస్తే ఖాతాలు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, బోగస్ లింకులను తెరవొద్దని సూచించారు. కార్యక్రమంలో జైభీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మారయ్య, యాదయ్య, సత్యనారాయణ, బాబురావు, కాలనీ ప్రెసిడెంట్ నందుసింగ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ద్రోణాచారి, సైబర్ క్రైమ్ పోలీసులు శ్రేయా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

కడ్తాల్, డిసెంబర్ 29: ప్రమాదవశాత్తు ఆటో కింద పడి చిన్నారి మృతి చెందిన ఘటన ఆదివారం తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పుష్పరాజ్ యాదవాసి కొంతకాలం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి, మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన జినుకుంట్ల శేఖర్‌యాదవ్ వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం శేఖర్‌యాదవ్‌కు చెందిన పాల డబ్బాలను ఆటోలో ఎక్కించారు. అదే సమయంలో పుష్పరాజ్ కూమార్తె ప్రియాన్సీ (11 నెలలు) ఆడుకుంటూ ఆటోకి కిందకు వెళ్లింది. ఇది గమనించని ఆటో డ్రైవర్ నరేశ్ ఆటోను నడుపడంతో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చిన్నారిని చికిత్స నిమిత్తం కడ్తాల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాద వివరాలను సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు జినుకుంట్ల నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గండిపేట చెరువులో మృతదేహం లభ్యం

మొయినాబాద్, డిసెంబర్29 : గండిపేట జలాశయంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట జలాశయం బ్యాక్ వాటర్‌లో నీళ్లపై కనిపించింది. జలాశయం వైపు వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతడి వయస్సు సుమారుగా 40-45 ఏండ్ల ఉంటుంది. అతడి ఒంటిపై రెడ్ కలర్ చెక్స్ షర్ట్ ఉండటంతో పాటు ఎస్‌వీ గేగూప్ పేరుతో నేవి బ్లూ కలర్ బనియన్, గ్రే కలర్ షర్ట్ ఉంది. ఎత్తు 5 అడుగులు ఉన్నాడు. మృతదేహాన్ని నగరంలోని ఉస్మానియా దవాఖాన మార్చూరీకి తరలించారు. మిగతా వివరాల కోసం 9491039043, 9490617188ను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 29: మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ మహ్మద్ అన్వర్ అనారోగ్యంతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం మరణించారు. ఈ మేరకు ఆదివారం మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అసోసియేషన్ తరపున రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో అసోసియేషన్ మండలాధ్యక్షుడు సుజాతమల్లేశ్ గౌడ్, రేషన్ డీలర్లు సత్యనారాయణ, బీచ్యానాయక్, టికులాల్‌నాయక్, జంగయ్య , లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, బుగ్గమ్మ, దశరథం సంఘం ఉన్నారు.



గుంతలుగా ఏర్పడిన ప్రధాన రహదారి



కంకరతేలి అధ్వానంగా మారిన జాపాల నుంచి ఆగపల్లి వెళ్లే రహదారి

# గుంతల రోడ్డు.. ప్రయాణం ఎలా..?

**వాహనదారులకు తప్పని ఇక్కట్లు**
**అధ్వానంగా మారిన ఆగపల్లి - జాపాల రోడ్డు**

మంచాల, డిసెంబర్ 29: మండల పరిధిలోని ఆగపల్లి నుంచి జాపాలకు వచ్చే ప్రధాన రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. ఈరోడ్డుపై ప్రయాణించే వాహనదారులు నిత్యం నరకయాతన పడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. జాపాల నుంచి ఆగపల్లి వరకు 5కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. ఈ రోడ్డు ఎటు చూసినా గుంతలతో పాటు కంకరతేలి అధ్వానంగా మారింది. దీంతో రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం గత ప్రభుత్వం రూ. 3కోట్ల 60లక్షలు కేటాయించినప్పటికీ పనులు మాత్రం నత్తనడకన నడవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో ఈరోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. నిత్యం జాపాల, రంగాపూర్, అస్మత్‌పూర్, చాంద్‌ఖాన్‌గూడ గ్రామాలకు చెందిన వారు వివిధ పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నం, హైదరాబాద్‌కు వెళుతుంటారు. ఇకనైనా అధికారులు ఈరోడ్డు పరిస్థితిని గుర్తించి రోడ్డు మరమ్మతు పనులను వేగం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

**రోడ్డును బాగు చేయండి..**



జాపాల నుంచి ఆగపల్లి వరకు ఉన్న గుంతల రోడ్డుతో రోజు ఇబ్బందులు పడుతున్నాం. ఇబ్రహీంపట్నం వెళ్లాలంటే మా గ్రామానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో పాటు దూరం తగ్గుతుందని అందుకే నిత్యం వందలాది మంది ఈరోడ్డు వెంటనే వెళుతున్నారు. ఈ రోడ్డును బాగు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నాం.

- అశ్వల వెంకటేశ్, వాహనదారుడు

## తండాల్లో వసతులు కల్పించాలి

**లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్**



మాట్లాడుతున్న లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 29: లంబాడాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్‌హాల్‌లో లంబాడాల గర్జన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీలు మాట్లాడే గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. లంబాడాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున అధికారిక సెలవుదినంగా, గోర్‌బోలి భాషను అధికారిక భాషగా ప్రకటించాలన్నారు. ప్రభుత్వాలు లంబాడీలను కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుంటున్నారు తప్ప వారి అభ్యున్నతికి ఏ మాత్రం కృషి చేయడం లేదన్నారు. తండాల్లో మౌలిక వసతులను కల్పించాలని, తండా పంచాయతీలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. దేశంలో లంబాడీలకు ఒకే భాష ఒకే రిజర్వేషన్‌ను కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు రైల్వే స్టేషన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి పట్టణ ముఖ్యకూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి నాయకులు మిట్టునాయక్, దాస్‌రామ్‌నాయక్, చంద్రనాయక్, రాజూనాయక్, లక్ష్మణ్‌నాయక్, చందూనాయక్, మోహన్‌సింగ్‌నాయక్, అన్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, సుధాకర్‌నాయక్, మోహన్‌నాయక్, సంతోశ్‌నాయక్, చందర్‌నాయక్, రామ్‌చరణ్‌నాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

## పీడీ అండ్ పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా భీముడునాయక్



అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

కడ్తాల్, డిసెంబర్ 29: పీడీ అండ్ పీఈటీ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ భీముడునాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ పీడీ అండ్ పీఈటీల సమావేశంలో, రాష్ట్ర అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు భీముడునాయక్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ రామచంద్రుడు, ఉపాధ్యక్షుడిగా తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజునాయక్, సంయుక్త కార్యదర్శిగా దేవదాస్, జిల్లా కన్వీనర్‌గా గాంగ్యానాయక్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు నుంచి నియామక పత్రాలను అందుకున్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామచంద్రుడు, అబ్దుల్లా పాల్గొన్నారు.

## బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మండలం మాచన్‌పల్లిలో బీసీసేన గ్రామ కమిటీని ఎన్నుకుంటున్న జాతీయ అధ్యక్షుడు కృష్ణ

షాబాద్, డిసెంబర్ 29: బీసీలంతా రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ అన్నారు. ఆదివారం షాబాద్ మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీసేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యాక్షులుగా మాణిక్యం, నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శులుగా నరేశ్, రమేశ్ గౌడ్, శేఖర్, ముసిలయ్య, శివకుమార్, ట్రెజరర్‌గా నర్సింహులు, సభ్యులుగా కుమార్, దేవేందర్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో బీసీలందరూ తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని సూచించారు. బీసీసేన ఆధ్వర్యంలో బీసీలను చైతన్యపరుస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు

షాబాద్, డిసెంబర్ 29: ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలంతా అన్ని రంగాల్లో వెనకబడిపోతున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు పెంచేంతా వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాచైతన్య సమితి మండల కార్యదర్శి విఠలయ్య, యూత్ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు రాజు, అజీమ్, వెంకటయ్య తదితరులున్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం

**సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి**



తోలుకట్టాలో సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్, డిసెంబర్29: కమ్యూనిస్టు పార్టీ కార్మికులు, కర్షకుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి అన్నారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని సజ్జన్‌పల్లి గ్రామంలో సీపీఐ గ్రామ కమిటీ కార్యదర్శి సత్తయ్య, తోలుకట్టా గ్రామ సీపీఐ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, పెద్దమంగళారం గ్రామ కమిటీ సీపీఐ కార్యదర్శి మల్లేశ్ అధ్యక్షతన ఆయా గ్రామాల్లో సీపీఐ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ సీనియర్ నాయకులు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, నాయకులు యాదగిరి, యశోద, లక్ష్మణ్, బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్, టి.నర్సింహులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియన్ రెజ్లింగ్ పోటీల్లో హైదరాబాద్ వాసికి సిల్వర్ మెడల్

ఎల్బీనగర్, డిసెంబర్ 29: సౌత్ ఇండియన్ నేషనల్ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన తోట సంకీర్తన్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానంలో నిలిచాడు. తెలంగాణ సీనియర్ రెజ్లింగ్‌లో 67 కేజీల గ్రీకో రోమన్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న సంకీర్తన్ యాదవ్ జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. సిల్వర్ మెడల్ సాధించడంతో చైతన్యపురిలో అతడి స్నేహితులు, కుటుంబసభ్యులు, స్థానికులు సంబురాలు జరుపుకున్నారు. కాగా తోట సంకీర్తన్ యాదవ్ బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్ కుమారుడు.




గ్లోబల్ వార్మింగ్‌పై ఓ విద్యార్థి గీసిన చిత్రం



హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్‌లో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 29: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కష్టపడి చదవాలని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శ్రావణ్‌కుమార్‌లు అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్‌లోని హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణంలో వస్తున్న మార్పుల వల్ల కలుగుతున్న నష్టాలు కళ్లకు కట్టినట్లు తమ చిత్రలేఖనంతో ఉదహరించారు. వ్యవసాయం ప్రాముఖ్యత, భూమి సారవంతంగా ఉంటే ఎలాంటి లాభాలు ఉంటాయి, గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ వారు గీసిన చిత్రాలతో కూడిన నమూనాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు, ప్లాస్టిక్ రిసైక్లింగ్ ఆవశ్యకతను విద్యార్థులు లేఖనం, వ్యాసరచన ద్వారా వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రాణి తన వంతు పాత్ర పోషిస్తుందనే నిజాన్ని వన్యప్రాణులు, పక్షులు పాత్ర సహజసిద్ధ అటవీలో ఏ విధంగా ఉంటుందో విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి ఆవిష్కృతం చేశారు. రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడా, సాంస్కృతిక విభాగాల కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, హైదరాబాద్ స్కాట్స్ స్కూల్ అధినేత జి.జగన్నాథం, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు కరుణాకర్, రాజేంద్రప్రసాద్, భాస్కర్, సందీప్, వాజీద్, శేషు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్

## ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్లరూరల్, డిసెంబర్ 29 : చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామంలో నిర్మిస్తున్న వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన నాయకుడు శేరి నర్సింగ్‌రావు రూ.50వేలు, రావులపల్లి మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్ రూ.25వేల చొప్పున విరాళాన్ని ఆదివారం ఆయల కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు.

**తుల్జాభవాని ఆలయానికి..**



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకుడు కృష్ణ

కడ్తాల్ : మండల పరిధిలోని రేఖ్యాతండా పంచాయతీలోని టాక్‌రాజ్‌గూడతండాలో చేపట్టిన తుల్జాభవాని ఆలయ నిర్మాణానికి రూ.15వేల విరాళాన్ని అంబేద్కర్ సంఘం మండల నాయకుడు కృష్ణ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు హన్మానాయక్, మాజీ ఉప సర్పంచ్ జగన్‌నాయక్, నాయకులు బాలరాం నాయక్ పాల్గొన్నారు.

## సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడి ఎన్నిక



లచ్చిరాం నాయక్

తుర్కయాంజాల్, డిసెంబర్ 29 : సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ మునగనూర్, తొర్రూర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా మునగనూర్‌కు చెందిన ఉదావత్ లచ్చిరాంనాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్‌లో ఏర్పాటు చేసిన సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్య రాథోడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, డిసెంబర్ 29 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధిలో సాధారణ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను 4 గంటల పాటు నిలిపివేయనున్నట్లు ఇంజాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రాములు తెలిపారు. తొర్రూర్ ఫీడర్, రంగనాయకుల గుట్ట ఫీడర్, మునగనూర్ ఫీడర్, బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఫామ్‌హౌస్‌పై పోలీసుల దాడి

మొయినాబాద్, డిసెంబర్ 29 : ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం సేవిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఓ ఫామ్ హౌస్‌పై దాడి చేశారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలోని సయ్యద్ ఫామ్‌హౌస్‌లో అనుమతులు లేకుండా మద్యం సేవించడంతో పాటు హుక్కా కూడా కొంత మంది యువకులు సేవిస్తున్నారని అందుకున్న సమాచారం మేరకు ఫామ్ హౌస్‌పై దాడి చేయడం జరిగింది. వారి వద్ద ఉన్న మద్యం సీసాలతో పాటు హుక్కాను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఫామ్ హౌస్ యజమాని, పార్టీ నిర్వహించిన నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మురుగు.. పరుగు

- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారులపై పారుతున్న మురుగు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

- తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు
- వ్యర్థాలతో దుర్గంధం వ్యాప్తి
- విషజ్వరాలతో మంచం పడుతున్న జనం

బడంగ్‌పేట, డిసెంబర్ 29 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై మురుగు నీరు పరుగులు పెడుతున్నది. వీఐపీలు నిత్యం ఇక్కడి రోడ్లపై ప్రయాణిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో రోడ్లపై మురుగుతో పాటు ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి కన్పిస్తున్నది. ప్రధానంగా శంషాబాద్ ఎయిర్ పోర్టు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం, టీసీఎస్, టాటా వంటి కంపెనీలకు వెళ్లే రహదారి పక్కనే నెలల తరబడి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తూనే ఉన్నది. అయితే అధికారులు తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు సర్వత్రా ఆరోపణలున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని బాగా చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప పనులు మాత్రం శూన్యమనే విమర్శలు వినవస్తున్నాయి.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నా ఎక్కడా స్వచ్ఛత కనిపించడంలేదని వివిధ కాలనీలవాసులు వాపోతున్నారు. ఈ విషయమై మీర్‌పేట మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

**అంటువ్యాధుల బారిన జనం**

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తున్నది. దాంతోపాటు చెత్తాచెదారం, వ్యర్థాలతో అంటువ్యాధుల ప్రబలి జనం మంచం పడుతున్నారు. జ్వరాలతో దవాఖానల పాలవుతున్నారు. చికన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల భారిన పడుతున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు, సిబ్బంది పట్టించుకునే పరిస్థితి లేదని స్థానికులు మండిపడుతున్నారు.

**మా దృష్టికి రాలేదు..**

మురుగు నీరు రోడ్ల పై పారుతున్న విషయం మా దృష్టికి రాలేదు. గతంలో రెండు సార్లు జేసీబీతో రోడ్లపై చెత్తను తొలగించారు. ఓపెన్ నాలాకు ఎమైనా చెత్త అడ్డుకున్నదేమో పరిశీలిస్తాం. మురుగు నీరు రోడ్లపైకి వస్తే క్లీన్ చేయిస్తాం. అదేవిధంగా మురుగు రాకుండా చర్యలు తీసుకుంటాము.

– శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్



ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం